క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిర్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్గాలో అన్నదానం ఏర్పాటు చేశారు.

అన్నదానానికి విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న అన్నదానం పథకానికి గురువారం ఓ భక్తుడు రూ.91,599 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఎమ్మిగనూరుకు చెందిన పవన్‌కుమార్‌రెడ్డి ఈ మొత్తాన్ని అందజేసినట్లు చెప్పారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



ఆదోని టౌన్ : వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఆదోనికి చెందిన కంటి వైద్య నిపుణులు ఓ.ఎం.కృష్ణమూర్తిని పార్టీ ప్రకటించింది. డాక్టర్ కృష్ణమూర్తి సేవాతత్పరుడని, ఆయన ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా పరీక్షలు, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేసేవాడని గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. సామాజిక తత్పరుడు కావడం వల్లనే పార్టీ ఆయన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారని చెప్పారు.

పెద్దహరివాణంలో కార్డెన్‌సెర్చ్



పట్టుబడిన మోటార్ సైకిళ్లను చూపుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి, పోలీసులు

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో గురువారం ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి ధ్రువ పత్రాలు లేని ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, టూటౌన్ సీఐ శ్రీనివాస్‌నాయక్, ట్రాఫిక్ సీఐ పార్థసారధి, పీసీఆర్ సీఐ మంజునాథ్, ఆదోని రూరల్, ఇస్వీ,పెద్దతుంబళం ఎస్‌ఐలు విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డి, పీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనతో సమస్య పరిష్కారం



విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

ఆదోనిఅర్బన్ : స్పందన కార్యక్రమంతో తమ సమస్య తీరిందని, కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బాధితుడు హనుమంతప్ప, గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. జీవనజ్యోతి ఆశ్రమం నిర్వాహకుడికి ఆశ్రమంలో ఉండేందుకు రూ.లక్ష ఇచ్చామని, అది తమకు తిరిగి ఇవ్వాలని కోరుతూ ఈనెల 17న స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే అధికారులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆశ్రమ నిర్వాహకుడు ఫిలిప్స్‌ను పిలిపించి హనుమంతప్పకు రూ.లక్షను తిరిగి ఇప్పించారు. బాధితుడు హనుమంతప్ప, అల్లుడు గణేష్ మాట్లాడుతూ స్పందనలో ఇంత త్వరగా సమస్య తీరుతుందని తాము ఊహించలేదని చెప్పారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

ఆదోని రూరల్ : మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని డ్వామా పీడీ అమరనాథరెడ్డి అన్నారు. గురువారం మేజర్ పంచాయతీ మండిగిరిలోని శాంతిమల్లప్ప చెరువు, తిరుమలనగర్‌లోని పరమేశ్వరి కళ్యాణ మండపం పక్కన ఉపాధి హామీ పథకం ద్వారా 350 మొక్కలను నాటారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మొక్కలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో తోడ్పాటునందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీడీ లోకేశ్వర్, ఎంపీడీఓ గీతావాణి, ఏపీఓ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, మాజీ సర్పంచ్ శేషిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం

- పేదలు బాగుపడటాన్ని ఓర్వలేకనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ విమర్శలు
- నిరుపేదలందరికీ ఇళ్లు కేటాయిస్తాం
- జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయి



ధ్రువ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, కమిషనర్

ఆదోనిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, సమస్యల పరిష్కారం అత్యంత సులువుగానూ, ఉచితంగానూ పొందుతున్నారన్నారు. గురువారం స్థానిక బోయగేరిలోని టీటీడీ కల్యాణ మండపంలో 32, 38, 39 వార్డుల పరిధిలోని వారికి ధ్రువ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు వివిధ కార్యక్రమాలు చేపట్టి వారి సమస్యలు పరిష్కరిస్తుండటంతో జనం సంతోషంగా ఉన్నారని, దీన్ని చూసి ఓర్వలేని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నిత్యం ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని, చివరకు వారు వలంటీర్లను కూడా వదలకుండా ఆరోపణలు చేశారంటే వారు ఏ స్థాయికి దిగజారారో గమనించాలన్నారు. రూ.2100 డీడీలు కట్టిన ప్రతిఒక్కరికీ పక్కా ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఆ జాబితాలో లేని వారికి టిడ్కో ఇల్లు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా.ఓఎం కృష్ణమూర్తి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్, కిషోర్, లక్ష్మి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, డిప్యూటీ తహసీల్దార్ వలి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి నగర్‌లో..

పట్టణంలోని అమరావతినగర్ పాఠశాల ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, ఎమ్మెల్యే తనయుడు మనోజ్ కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జయమనోజ్‌రెడ్డి, బోయ శాంత 800 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. మనోజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయన్నారు. కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, మహ్మద్‌స్వామి, ఎర్రిస్వామి, ఎంఈఓ నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దకడబూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని మేకడోణ గ్రామంలో సర్పంచ్ కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు విద్యార్థులకు మొత్తం 363 ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లను తనిఖీ చేసి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆర్‌ఐ మహేష్, వీఆర్‌ఓ, నాయకులు యోగేంద్రగౌడ్, నాగేంద్రగౌడ్ పాల్గొన్నారు.



మేకడోణలో విద్యార్థులకు ధ్రువ పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : మండలంలోని ఆరేకల్ గ్రామంలో సర్పంచ్ లోహితప్రియ వీరస్వామి అధ్యక్షతన, ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం వెయ్యి మందికి ధ్రువ పత్రాలు అందజేశారు.డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, గ్రామ నాయకులు వీరస్వామి, రాముడు, నాగరాజు, పంచాయతీ సెక్రెటరీ చంద్రకళావతి పాల్గొన్నారు.

డబ్బులు ఆదా అయ్యాయి



కులం, ఆదాయం సర్టిఫికెట్లు ఉచితంగా అందించారు. గతంలో ఈ సర్టిఫికెట్లు పొందాలంటే రూ.300 చొప్పున చెల్లించాల్సి ఉండేది. దీంతో మాకు రూ.600 ఆదా అయ్యాయి. గతంలో సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి తిరిగాం. జగనన్న ప్రభుత్వం సురక్ష ద్వారా పేదలకు ఉచితంగా సర్టిఫికెట్లతో పాటు సమస్యలను పరిష్కరించడం సంతోషం.

– మంజుల, బోయగేరి, ఆదోని పట్టణం

సంతోషంగా ఉంది



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేయడం అభినందనీయం. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పథకాలు రాని వారిని గుర్తిస్తున్నారు. అలాగే ఏదైనా సర్టిఫికెట్ అవసరముందా అని అడిగి వారే దరఖాస్తు చేసి రెండు రోజుల్లో పిలిచి మరీ అందజేయడం సంతోషం. ఇంతకు ముందు ఇలాంటి కార్యక్రమం జరగలేదు. వీటి ద్వారా ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి.

– జ్యోతి, నిజాముద్దీన్‌కాలనీ, ఆదోని పట్టణం

నేటి నుంచి ఓటరు జాబితాపై సర్వే

మంత్రాలయం: నేటి నుంచి ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ ఆర్వో రమాదేవి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు తహసీల్దార్‌లు చంద్రశేఖర్, రుద్రగౌడ్, వీరభద్రగౌడ్ సమక్షంలో నియోజకవర్గంలోని రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేటి నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ఓటరు జాబితాపై బీఎల్‌వోలు, బూత్ అసిస్టెంట్‌లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తారని, ఎవరికైనా అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. అనంతరం పలు అంశాలపై రాజకీయ పార్టీ నాయకులతో చర్చించారు.

ఇస్వీ ఎస్‌ఐగా శ్రీనివాసులు



ఆదోనిరూరల్ : మండలంలోని ఇస్వీ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా శ్రీనివాసులు గురువారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఈయన పెద్దకడబూరు పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇస్వీకి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ విజయలక్ష్మి బదిలీపై ఆదోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

టిడ్కో గృహాలు ఇవ్వాలి

ఆదోనిరూరల్ :పట్టణంలో గృహాల కోసం డీడీలు కట్టిన లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలు వెంటనే ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్ కోరారు. గురువారం వారు ఇందిరానగర్, బీసీ కాలనీ, మండగిరి వార్డుల్లో పర్యటించారు. వారు మాట్లాడుతూ టిడ్కో గృహాల సముదాయంలో సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.

విద్యార్థులకు సన్మానం

ఆదోని సెంట్రల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం రాత్రి తన స్వగృహంలో ఏపీ ఈసెట్‌లో స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. స్టేట్ మొదటి ర్యాంకు సాధించిన ప్రవీన్‌కుమార్, 56వ ర్యాంకు విజేత తేజను,116వ ర్యాంకు సాధించిన కలందర్‌తో పాటు గెట్ ఇండియాలో 1576 ర్యాంకు సాధించిన పవన్‌కుమార్‌ను సన్మానించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సాయి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆదోనిటౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులకు పింఛన్ వసతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో 'థ్యాంక్యూ సీఎం' అంటూ ఆర్టీసీ ఉద్యోగులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గురువారం ఆర్టీసీ డిపోలో డీఎం మహ్మద్ రఫిక్, అసిస్టెంట్ కమిషనర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, ట్రాఫిక్, గ్యారేజీ, ఆఫీసు, సెక్యూరిటీ సిబ్బంది, అన్ని సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆర్టీసీని ఆదుకోవడమేగాకుండా ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించారన్నారు.



ఆర్టీసీ డిపోలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

విద్యాభివృద్ధికి పెద్దపీట



పాఠశాల అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేసి అన్ని విధాలుగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ. 2.14 కోట్లతో నూతనంగా నిర్మించిన 10 అదనపు గదులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడుతో పాఠశాలలకు మరమ్మతులతో పాటు నూతన భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్‌తో పాటు వసతులు సమకూర్చి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్చారని కొనియాడారు. అలాగే..పాఠశాలకు వచ్చిన డిజిటల్ క్లాస్‌లు భోదన కోసం వచ్చిన ఐఎఫ్‌పీ ప్యానల్‌ను ప్రారంభించారు. పాఠశాలకు మొత్తం 24 ప్యానల్స్ వచ్చినట్లు హెచ్‌ఎం ఇమ్మానుయేల్ తెలిపారు. ఒక్కొక్కటి రూ.1.20 లక్షలు ప్రకారం 24ప్యానల్స్‌లను పాఠశాలకు పంపిందన్నారు. అనంతరం ఈనెల23న ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ముందస్తుగా పీఎంసీ చైర్మన్ వడ్డె రాము ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు.

రూ.2 లక్షలు విరాళం

చర్చి ప్రహరీ నిర్మాణానికి రూ.2లక్షలను ఎమ్మెల్యే విరాళంగా అందజేశారు. కౌతాళంకు వచ్చిన ఆయన ముందుగా వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి తయారు చేసిన పాట క్యాసెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం చర్చిలో జరిగిన కార్యక్రమంలో విరాళాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ చర్చికి రూ. 5లక్షలు ఇస్తామని మాట ఇచ్చామని, గతంలో రూ.2 లక్షలు ఇచ్చామని, మిగిలిన మొత్తం త్వరలో అందజేస్తామని చెప్పారు. సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డి, ఎంపీపీ అమరేష్, కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ మహబూబ్ సాబ్, సర్పంచ్ పాల్‌దినకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ఎంఈఓ శోభరాణి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం

కౌతాళం: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యం కాగలదని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాజనగర్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి ఎరిగేరి గ్రామానికి తాగునీటి సరఫరా కోసం రూ.45లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను ప్రారంభించారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని అర్హులకు ధ్రువ పత్రాలను అందజేశారు.

కబ్జా మాకు చేత కాదు..

ఇటీవల ఎరిగేరి గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి భూ కబ్జాకు పాల్పడ్డడని టీడీపీ నాయకుడు తిక్కారెడ్డి ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. ఏదైనా మాట్లాడే ముందు కనీసం ఆలోచించరా అని ప్రశ్నించారు. తాను కబ్జాకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. తమకు సాయం చేయడమే తప్ప కబ్జాలు చేయడం రాదని స్పష్టం చేశారు. ఇలాంటి పనికి మాలిన మాటలు మాట్లాడకుండా ఏదైనా ప్రజలకు మంచి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. తాను, తన తల్లి, తమ చిన్నమ్మ కానీ భూమిని కబ్జా చేయలేదని మా కుటుంబానికి అలాంటి అవసరం ఇప్పటి వరకు రాలేదన్నారు. తిక్కారెడ్డి పద్ధతి మార్చుకోక పోతే బాగుండదని హెచ్చరించారు. ఈ భూమి తన తాత ఆస్తి అని ల్యాండ్ సీలింగ్ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. అనంతరం ఆ భూముల్లో పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారని చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆర్డీఎస్ పనులు వేగవంతం చేయాలి

కోసిగి: మండలంలోని అగసనూరు గ్రామ సమీపంలో తుంగభద్ర నది వద్ద చేపడుతున్న ఆర్డీఎస్ కుడి కాల్వ పనులు వేగవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప కోరారు. గురువారం ఆర్డీఎస్ ఆనకట్టను సందర్శించారు. వారు మాట్లాడుతూ కుడి కాల్వ పనులు పూర్తి అయితే జిల్లా పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, పంపన్న గౌడ, మండల కార్యదర్శి గోపాల్, వీరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లాసహాయక కార్యదర్శి విజయేంద్ర పాల్గొన్నారు.

పెద్దకడబూరు : ఆర్డీఎస్ కుడి కాలువ పనులను పూర్తి చేయాలని గురువారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో జీపుజాత చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం తాలుకా కార్యదర్శి మబ్బు ఆంజనేయ మాట్లాడారు.

కోసిగిలో చోరీ



బీరువా తలుపులు బద్దలుగొట్టిన దృశ్యం

కోసిగి: స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సమీపంలో నివాసం ఉంటున్న దాస సుజాత ఇంట్లో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఆమె ఇంటికి తాళం వేసి ఐదు రోజుల క్రితం బెంగళూరులో ఉన్న కూమారుడు దగ్గరకు వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి చేరుకుంది. తాళం పగిలి ఉండడం చూసి ఇంట్లో దొంగతనం జరిగినట్లు లోపలికి వెళ్లి చూస్తే వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువా తలుపులు పగలగొట్టారు. అందులో ఉన్న తులం బంగారం, 10 తులాల వెండి, రూ.10వేల నగదు దోచుకెళ్లినట్లు గుర్తించింది. కాగా రెండేళ్ల క్రితం మూడు తులాల బంగారం, రూ.50వేలు నగదు దోచుకెళ్లారని వాపోయింది. గతంలో కేసు నమోదు చేయించినా రికవరీ చేయించలేదని, ప్రస్తుతం ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరిగే నమ్మకం లేదని పేర్కొంది.

పరామర్శ

మంత్రాలయం: రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బొజ్జప్ప తమ్ముడు శ్రీనివాసులు బుధవారం అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గురువారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని శ్రీనును పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

ఆస్పరి: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో డీఎస్పీ ఆధ్వర్యంలో నాకా బందీ చేపట్టారు. అనుమానితుల ఇళ్లలో పోలీసులు సోదాలు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామస్తులు ఐకమత్యంతో పండుగ జరుపుకోవాలన్నారు. చిన్న చిన్న సమస్యలకు పంతాలు పట్టింపులకు పోకుండా సర్దుకుపోవాలన్నారు.

మానవతా దృక్పథంతో వైద్యసేవలు అందించాలి



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి, ఎమ్మెల్సీ, సబ్ కలెక్టర్

ఆదోనిటౌన్ : ప్రభుత్వ ఆస్పత్రులకు వైద్యం కోసం వచ్చేవారంతా పేదలేనని, మానవతా దృక్పథంతో వైద్యసేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కోరారు. గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రి హాల్‌లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, సభ్యులు గోపాల్‌రెడ్డి, మునీర్, శోభాలత, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఓ.ఎం.కృష్ణమూర్తి, డాక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, మున్ముందు మరిన్ని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశారు. డాక్టర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వైద్యంకోసం వస్తే డ్యూటీలో సరిగా ఉండడంలేదనే ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. రాత్రి, మధ్యాహ్న సమయాల్లో డాక్టర్లు డ్యూటీలో ఉండటం లేదని, రోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తనకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆసుపత్రిలో బాత్‌రూమ్, లెట్రిన్ పనులు వేగంగా జరగడంలేదని, అంత అశ్రద్ధగా ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు. మీ ఇళ్లల్లో రెండు మూడు నెలలు బాత్‌రూంలు లేకుండా ఇలాగే ఉంటారని ప్రశ్నించారు. సిటీస్కాన్, ఎంఆర్‌ఐ వసతి కల్పించేందుకు తీర్మానం చేశారు. అనవసర రెఫర్ విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. డీఎంఏ పరిధిలోకి విలీనం చేసి జిల్లా ఆసుపత్రిగా మార్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నారు. డాక్టర్లు కుమార్‌నాయుడు, మయూరకుమార్, రవి, సరోజ, జగదీష్ కుమార్, నాగరాజ్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

ఆదోని రూరల్ : ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సింగ్‌లకు, ల్యాబ్ టెక్నీషియన్లకు కనీస వేతనం ఇవ్వాలని, శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రభుత్వం స్టైఫండ్ ఇవ్వాలని ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదరి బాలు కోరారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో అప్రెంటిస్ షిప్ విధానాన్ని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రారంభించిందని ఆ సంస్థ ద్వారా వీరికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చూడాలని కోరారు. డివిజన్ కార్యదర్శి వంశీ, జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, అశోక్, రామనాయుడు పాల్గొన్నారు.

23న ఉచిత కంటి వైద్యశిబిరం

ఆదోనిఅర్బన్ : నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి సౌజన్యంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సహకారంతో ఈనెల 23వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, ఎన్నారై కాకబల్ నగేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరం పట్టణంలోని ఆర్యవైశ్య హాస్టల్ ఎస్కేడీ కాలనీ 3వ రోడ్డుని వైట్‌హౌస్ వద్ద నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యపరీక్షలు చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఆదోని రూరల్ : కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేష్ కోరారు.గురువారం ఆదోని నుంచి కర్నూలు వరకు ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు సీపీఎం పార్టీ చేపట్టిన మహాపాదయాత్రను జయప్రదం చేయాలని జీపు జాతా కార్యక్రమం ప్రారంభించారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని మరాఠీగేరిలో వెలిసిన శ్రీ పాపమ్మ మఠం వద్ద హోమియోపతి వైద్యుడు సోమశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. కాలనీ ప్రజలకు బీపీ, షుగర్ తదితర చికిత్సలు చేసి ఉచితంగా హోమియో మందులను అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దకడబూరు : తమ సమస్యలను పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు రిలే దీక్షలు చేపట్టారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్‌ఏల మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం దీక్షలు ప్రారంభించారు. కమిటీ మండల అధ్యక్షుడు భీమన్న, ఉపాధ్యక్షులు నరసయ్య, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. 60ఏళ్లు పైబడిన వీఆర్‌ఏ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఎలాంటి ప్రవేశ పరీక్షలు నిర్వహించకుండా పదోన్నతులు కల్పించాలని కోరారు.

కోసిగి: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజి, సీఐటీయూ కోసిగి మండల కార్యదర్శి రాములు కోరారు. గురువారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో వీఆర్‌ఏలు రిలే దీక్ష చేపట్టారు. సంఘం జిల్లా నాయకులు ప్రహ్లాద, మండల ఉపాధ్యక్షులు వీరేష్,డివిజన్ అధ్యక్షులు రాజు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

పత్తికొండ రూరల్: ఓటర్ల జాబితాపై గురువారం ఆర్డీఓ కార్యాలయంలో మోహన్‌దాస్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హులను జాబితా నుంచి తొలగించేందుకు నెలరోజుల కార్యాచరణ కొనసాగుతుందన్నారు. ఓటర్ల వివరాలను బీఎల్‌ఓలు సర్వే చేస్తారని మార్పులు, చేర్పులు, తప్పొప్పులపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఎన్నికల డీటీ శ్రీనివాసులు, ఆయా మండలాల తహసీల్దార్లు విష్ణుప్రసాద్, రవి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ఓటరు జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆలూరు అసెంబ్లీ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ మల్లికార్జున కోరారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

బీమా అందేలా చేశాడు..

మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఉప్పర నారాయణప్ప ఆరు నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ పరమేష్ వెంటనే షయాన్ని సచివాలయ అధికారులకు తెలియజేసి, వైఎస్సార్ బీమా అందించేలా చర్యలు తీసుకున్నాడు. ఉప్పర నారాయణప్ప మృతదేహాన్ని సందర్శించి మట్టి ఖర్చుల తక్షణ సాయంగా రూ.10 వేలను సచివాలయ అధికారుల ద్వారా నామినీ మణెమ్మకు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. – ఆదోనిరూరల్



ఉప్పర నారాయణప్ప మృతదేహాన్ని సందర్శించి వివరాలు సేకరిస్తున్న వలంటీర్ పరమేష్ (ఫైల్)

వలంటీర్ సాయం మరువలేం



నా భర్త ఉప్పర నారాయణప్ప ఆరు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. ఆ సమయంలో అంత్యక్రియలకు తమ చేతిలో చిల్లి గవ్వ లేదు. ఏమి చేయాలో తెలియని పరిస్థితి. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ పరమేష్ దేవుడిలా స్పందించి మట్టి ఖర్చులకు వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు అందించాడు. ఆ డబ్బులు మట్టి ఖర్చులకు ఉపయోగపడ్డాయి. అనంతరం వితంతువు పింఛన్ వచ్చేలా చేశాడు. నాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడికి అమ్మ ఒడి పథకం డబ్బులు అందుతున్నాయి. జగనన్న ప్రభుత్వం ద్వారా ఆపద సమయాల్లో మా కుటుంబానికి చేయూతనిచ్చింది. ప్రభుత్వం పథకాలు వలంటీర్ పరమేష్ ద్వారా మాకు సక్రమంగా అందుతున్నాయి. ఆయన సేవలు మరువలేనివి.

– ఉప్పర మణెమ్మ, పెద్దహరివాణం